


# కాబూలీ వాలా

'పాప'

చదువు పరదాలో హోదా కిరీటం ధరించి, డాబుగా బ్రతికేవారు గతిలేక నీతికి, నిజాయితీకి విడాకులిస్తారు. అవేవీ లేనివారు, వాటికోసం ప్రాణాన్ని సైతం బలిపెట్టడానికి సిద్ధపడతారు... వారిలోనూ, వీరిలోనూ తళుక్కున మెరిసే మానవత్వం మెరుపు ఒకటి ఉంటుంది గదా!

విశాఖపట్టణము, విశాఖ, వైజాగు, వాల్తేరునా బహు నామంబుల బరగి ప్రసిద్ధిగనిన మహా పట్టణం బొండు గలదు. ఆ పురి నేలు దొడ్డ దొర కడుంగడు స్తవనీయుండగు శ్రీ శపిమహారాజుగారు.

దేశంలో దరిద్రమంత సముద్రం ఆ ఊర్లో ఉందట గానీ ఆ సముద్రమంత దరిద్రమూ ఆ ఊర్లోనే ఉంది. అందుకు సాక్ష్యం ఆ ఊర్లో అసంఖ్యాకంగా బతుకుతూన్న కాబూలీవాళ్లే!

సంప్రదాయాన్ని గౌరవించడం కాబూలీవాళ్ల దగ్గిర మనవాళ్లు నేర్చుకోవలిసిందే! అంగరఖా నుండి అడుగుల చెప్పుల్దాకా ఆఫ్ఘన్ ఆచారాలు ఉట్టి పడతాయి. ఆ మాటకి వస్తే మహమ్మదీయ మతంలోనే ఉందేమో క్రమశిక్షణ! తంచనుగా సాయంత్రం ఆరయ్యేసరికి ఎక్కడున్నా ఇంటిదగ్గిర వాలిపోతారు. అలా వీలుకాకపోతే ఎక్కడి వాళ్లక్కడ మోకాళ్లమీద వంగి నమాజు చేసుకుంటారు. మొదట్లో ఇది పెట్టిగారి లక్ష్మీపూజ, పొలిటీషియన్ విలువుదోపిడీ, స్టూడెంటు కుర్రాడి రుద్రాభిషేకాల్లాంటిదని అనుకునేవాణ్ణి. ఈమధ్య

కాబూలీలతో దోస్తీ బాగా కలిశాకా నేను తెంపలేసుకున్నాను, నా తప్పుడభిప్రాయానికి.

"క్యా, షంక్రావ్‌గారూ, ఒడీ తెచ్చావ్?"

కంఠం! ఎంత గొప్ప కంఠమని! ఖంగుమని బాకీవాడి గుండెల్లో బాకాలాగా మోగుతుంది.

అప్పుడే పొయ్యిమీదనించి దించిన మాంసం మూకుడు చుట్టూ పదిమందీ మూగి రొట్టెలు దాంట్లో ముంచుకు బకాయిస్తున్నారు. ఘుమఘుమ లాడుతూంది కూర! ఎక్కడో దూరదేశాల్లో ఆలుబిడ్డలని వదిలి వస్తారు. ఒకరి కొకరు చేదోడు వాదోడుగా కాబూలీలు పదిమందీ కలిసి ఒక కుటుంబంగా నివసిస్తూంటారు. ఇంట్లో ఉన్నప్పుడు మామూలు మనుషులే!

కుడిచేత్తో రొట్టెలు పట్టుకొని, ఎడంచేత్తో పిడిపి నోట్లో కుక్కుకుంటున్నారు, కబుర్లాడుతూ.

"ఏం ఖాన్‌భాయీ! భోజనంచేస్తున్నార్లా ఉందే!" అన్నాను ఒకడుగు వెనక్కి వేస్తున్నట్టు నటిస్తూను, వా డడిగిందానికి జవాబు తప్పిస్తూనూ. ఈమధ్య నాకు గొప్ప ధైర్యం అలవాటైపోయింది. మొదట్లో ఆ గుమ్మంలోకి తొంగిచూడడానికి గుండె అవిసిపోయేవి. వెళ్లానంటే చెమటలు కక్కుతూ, గుటకలు మింగుతూ నానా బీభత్సమైపోయి నోట మాట పెగిలేది కాదు. ఇప్పుడా? ఇంకా చలేనా?

"ఫర్వానై భాయీ! బైఠ్" అన్నాడు. "వడ్డీ తెచ్చావా" అన్నప్పటి కంఠానికీ, "కూచో" మన్న కంఠానికీ భేదం ఉంది. మొహంలో పసిగట్టే ప్రయత్నం చేస్తాడు, మనం వడ్డీ తెచ్చిందీ తేందీనూ! కాబూలీలు ఎంత కఠినంగా కనిపిస్తారో అంత అమాయికులు; పిరికివాళ్లు కూడా! అదంతా మనలో ఉంది. నేనేమో చిన్నప్పట్నుండీ స్టేజి అనుభవం గలవాణ్ణి!

"వాహ్! భలే ఘుమ్ ఘుమ్ లాడుతూందే తకిలీ!" ఉర్దూ ఏసలో వాళ్లు తింటూన్న కూరను పొగిడేస్తూ కుర్చీలో కూర్చున్న తరవాత "తకిలీ" ఏమిటి, నా మొహమనిపించింది. కూరని తర్కారీ అంటారు కదూ! కాలాతీతమైనా ఫరవాలేదని "తర్కారీ, తర్కారీ!" అన్నాను సహజ గంభీర మందహాస వదనంతో, కరెక్టునిస్తూ!

కానీ ఇదేం పట్టించుకోలేదు ఖాన్! దవడ అప్పళించి నాలికతో నోట్లోని స్టఫ్ కూడదీసి బుగ్గలో ఇరికించి పట్టి "మీ ఆఫీస్‌లో బులక్రావ్ ఏం చేస్తాడ్" అనడిగాడు.

మన పేర్లు వివిధ రూపాల్లోకి మారిపోతాయి వీళ్ల నోళ్లలో పడి, ఆ నోట్లోని పరోటా ముద్దలాగానే! "షంక్రావ్" అంటే శంకర్రావు. "బులక్రావ్" లంటే పది నిమిషాలు గింజుకున్నాక భూలోకరావని తట్టింది. పాపం, అర్భకుడు. ఆర్నెల్లయింది ఉద్యోగంలో చేరి, అప్పుడే కాబూలీల పాల బడ్డాడన్నమాట!

"ఆఁ ఆఁ! భూలోకరావా? ఔను. ఏం చేస్తున్నాడు?"

"పెర్మనెంటా, టెంప్రవరీ?" రెండో ప్రశ్న!

ముందు ఏ ఆఫీసులోనైనా ఎవరినైనా టెంపరరీ గానే వేస్తారు గదా! అది వీడికి చెబితే నచ్చదు. అప్పు పెట్టడు. పాపం, భూలోకరా వెంత అవసరంలో ఉన్నాడో! అయినా టెంపరరీ అని చెప్తే ఒక నిజమైనా చెప్పినట్టవుతుంది, భూలోకరావు కాబూలీ ఊబిలో పడకుండా చక్రం అడ్డేసినట్టు ఔతుంది.

"అబ్బే, ఆర్నెల్లయి వచ్చాడు! టెంప్రవారీ" అన్నాను.

"అరె కాఫిర్! ఝూట్ బోలా? మాకీ అబధం చెప్తాడ్?" అన్నాడు, నేనే అబద్ధం చెప్పినంత చిరాగ్గా!

"అదేలే, పెర్మనెంటౌతాడ్లే! ఇంతలో ఉద్యోగం పోదు" అన్నాను నెమ్మదిగా.

"అదేం కిరికిరీ? టెంప్రవారీవాడు పెర్మనెంటౌతాడూ, సస్తాడూ, బతుకూతాడూ... అథాఖ్రా ఒడీహక్దా కుర్సీ మీదా పెట్టి మీ రెల్లు" అన్నాడు.

వీడికి చిరాకు తెప్పించితే ఆ చిరాకంతా ఎటుపడితే అటు పార్కిపోతుంది. కర్మ, సరిగా సమయానికి వీడికి చిరాకువచ్చింది.

"అదే, చెప్తా. నువ్వు భోజనంచేయ్!" అన్నాను ఆరగుటక వాడికి కనిపించకుండా మింగుతూ.

"ఏం సెప్తావ్? సెప్డం గిప్డం నై! ఒడీ ఇవాలా!"


"అరె, ఇస్తానయ్యా. ఎందు కలా కేకలేస్తావ్? తిండి తిను." చిన్న చిరునవ్వుకూడా తగిలించా నీ మారు. కొంచెం బకాయి పెట్టి సగం వడ్డీ తెచ్చినట్టు వాడికి తాత్కాలికంగా నమ్మకం పుట్టించడంకోసం.

"సోయి నెలా నాగా సేశావ్! అంత్కా ముందూ బాకీ..." నణుగుతూ గబగబా భోజనంచేయసాగాడు.

"ఏం చెయ్యను, ఖాన్! వారం రోజులైనా కాలేదు, మా ఆవిడ మళ్లీ పురుడయిం." అన్నాను నేను సాలోచనగా లేక శూన్యంలోకి చూస్తూ.

గోమటేశ్వరస్వామి (శ్రవణబెళుగొళ)

చిత్రం — శ్రీ బి. హెచ్. నందరావు (మద్రాస్-17)



"ఇదేం, షంక్రావ్! జన్వరీ నెల్లో శాదీ అయిందని డబ్బు ఖర్చైపోయిందన్నావ్! ఫిబ్రవర్లో పిల్ల పుట్టిందన్నావ్! మార్చిలో మరొక పుర్దూ! క్యా తమాషాండీ!"

అబ్బా! నీకి కెంత గుర్తు!

"భలేవాడివే, ఖాన్! నే నలా చెప్పానా? సరిగా గుర్తు చేసుకో! అంత ఇన్‌కన్‌సిస్టెంటుగా నే నబద్ధాలు చెప్పను సుమ్మా!" అన్నాను బాధించే స్వరంతో. ఆ మాట నిజమే! అబద్ధాలు ఇన్‌కన్‌సిస్టెంటుగా నే నెందుకు చెప్తాను, కథలు రాసే వాణ్ణి! కానీ ఆ ఇంగ్లీషు ముక్క వాడికి అర్థమై చావదు.

"మంచ్‌దీ! అబద్ధాల్ నువ్వు సెప్పవు. నేను సెప్తాది." నెమ్మదిగా భోజనం ముగించాడు. జై వీరాంజనేయా!

"ఒడీ ఇయ్, ఒడీ ఇయ్!" నాలిక చప్పరిస్తూ కుడి చెయ్యి లుంగీకి పాముకుంటూ ఎడం చెయ్యి చాపాడు ఇయ్యకపోతే వీడు నన్ను చప్పరించేసేలా ఉన్నాడు.

ఏం చెప్పాలి?

ఏదో అబద్ధమే చెప్పాలి మామూలుగా!

తప్పని సమయస్ఫూర్తితో అప్పటికి తోచిన కథ ఆశువుగా చెప్పాలి. ఆధునిక తెలుగు కవులు తమ మిడిమిడి సంస్కృత పరిజ్ఞానాన్ని తెలుగు కావ్యాలో ఎందుకు వాడుకుంటారో ఎరగనుగానీ, నేను కాబూలీ వాడికి చెప్పే కథల్లో వాడికి రాని ఇంగ్లీషు ముక్కలు కలిపి జోడించి చెప్పడంలో మాత్రం ఘనమైన ఆశయాలున్నై! ఒకటి: నేను బాగా విద్యావంతుణ్ణి, సంఘంలో గౌరవనీయుణ్ణి, హోదాగలవాణ్ణని ముక్క ముక్కకీ గుర్తు చెయ్యడమవుతుంది. రెండు: మనం చెప్పే మాటలు పూర్తిగా వాడికి అర్థంకావు. మూడు: మనం జాగ్రత్తగా ఆలోచించి సక్రమంగా ఒక పద్ధతిలో అబద్ధం చెప్పవలిసిన కట్టుబాటు సడలిపోతుంది.

మాటవరసకి, "ఈమధ్య కేసనోవా సెవంటీ పిక్చరు వరస్సగా ఫ్రెండ్స్‌తో వారం రోజులు డైలీ ఫ్రీషోస్ చూశాను. తస్సల్ చెక్కా! టికెట్స్‌కోసం బడీముష్కిల్ అయిపోయింది, భాయీ! బ్లేకులో కొన్నాను. అదీ చిల్లరకాదు, టోకున! వెధవది నెలాఖర్లో వచ్చింది పిక్చరు! అప్పుచేసి ఎక్స్‌పెండిచర్ మీట్ కావలిసి వచ్చింది ... అందుచేత..." అని నేనంటే, "ఔనూ హండీ! అన్నీ నెలాఖర్లో ఖర్చులు హోస్తాయ్! మీకీ ముష్కిల్ ఔతాది. మరి మాకీ మాటా ఏం చెప్తార్? మాకీ ముష్కిల్ కాదా? యూపార్మా, మజాకా? మీకీ ఒక నెలా జీతం రాకపోతే ఏం చేస్తార్?" ... అని వాడర్థం చేసుకున్న తీరుకి తగిన ఎటక్ ఇస్తాడు వాడు.

"నిజం! పాపం, మీకూ కష్టమే! మరి కిందటి నెల ఇచ్చేశాగా? అంటే అదే, ఆ పోయిన్నెల! ఫస్టయ్యేసరికి మీ కుర్రవాడి చేతి కిచ్చేయడం నాకు రివాజు. మరి వాడు రావడం లేదుగా?" వాడి కర్థం కావలసిన మాటలు మాత్రం స్వచ్ఛంగా, నిండుగా ఉచ్చరిస్తూ చెప్పాలి. ఇంగ్లీషు వాడకూడదు.

"సర్సరే! హెప్డూ ఇస్తావ్?" ఒక్కేనికి చేర పడ్డాడు. అంటే ఆ నెల వడ్డీకి ఆగొరులుకున్నాడు. పాపం, మంచివాడు ఖాన్! అందర్లాగా గట్టిగా డబాయించడం, మెడమీద చెయ్యెయ్యడం, జుట్టట్టుకోవడం ... నో నో!

"ఇదుగో, రేపు పదో తారీఖు ఇస్తాను. పత్రికల

వాళ్ళు మనకి కొంచం డబ్బు బాకీ!'' మరొకరు మనకి బాకీ అని అప్పులాళ్ల దగ్గిర చెప్పడం కూడా శక్యమే.

"అదా! మంచిది! వది తారీఖ్ రాకపోతే మనమే ఆఫీస్కి హాజరౌతాం!'' అని కళ్ళు మూసుకున్నాడు.

"ఛ ఛ! నువ్వెందుకు రావడం? మా కుర్రాణ్ణి పంపు, చాలు!''

కుర్రాడి నెలాగైనా చెప్పి పంపేయచ్చు. వీడు వచ్చాడంటే ఆఫీసులో పెద్ద సీన్!

"ఏం ఫర్వాడు? మేమే ఒస్తాం! ఎల్లు! వది తారీఖ్ పక్కా!'' అన్నాడు పక్కకి ఒత్తిగిలుతూ.

• • •

కాబూలీలు ఒకొక్కడూ ఒకొక్క అంతరంగిక కార్యదర్శిని నియమించుకుంటారు. వాడు దుబాసీ! రెండు భాషలూ ఎరిగి రాయబారం నెరపుతాడు ఆరంభంలో! మనల్ని తీసుకుపోయి కాబూలీకి పరిచయం చేసి, మన మంచితనాన్ని, సచ్ఛీలతను, సత్యసంధతను శతఃపునరుద్ఘాటించి మన కింత అప్పు పెట్టించడంలో సాయం, ఉపకరిస్తాడు. ఆటుపిమ్మట నెలనెలా వాడే మనకి సాక్షాత్కరిస్తాడు, మనం సేపీలు పెట్టేంత సరకూ! చదువు చాలా కొంచెం! ఐదు, ఆరు తరగతులతో చాలించే కుర్రాళ్ళే సాధారణంగా నియమించ బడతారు.

వాడి ముఖ్యమైన ఉద్యోగార్హత ఉర్దూ, తెలుగూ క్షుణ్ణంగా తెలియడం. కాబూలీ యూనిఫారమ్‌కి భిన్నంగా మామూలు దుస్తుల్లో ఉంటాడు గనక వీడు మనల్ని సమీపించినా అంత నామోషీ లేదు.

పదో తారీఖున ఠంచనుగా కుర్రాడొచ్చాడు, ఆఫీసుకి.

"ఏంహోయ్, బిస్మిల్లాఖాన్!'' వాణ్ణి నా ఇష్టం వచ్చిన ఔత్తరాహిక సంగీత సార్వభౌముల పేర్లతో పిలుస్తూంటాను. "సార్!'' అంటూ చిరునవ్వు లొంకబోశాడు. వాడిది ఉద్యోగం! వడ్డీ వసూలు తప్పని సరిగా కానక్కర్లేదు. ఆ మాటకొస్తే కాకూడదు, వాడి బాగుదృష్ట్యా! తిప్పినప్పుడంతా ప్రతి టర్నుకీ పావలా బేడా ముట్టజెప్పి ఇప్పుడు వడ్డీ లేదని పంపిస్తాంగదా! వడ్డీ ఇచ్చేప్పుడైతే వీడికి, వీడి షావుకారుకి తలా నాలుగు అక్షతలు వేసి మొక్కుతూ మూలుగుతూ ఇస్తాం!

"మీవాడేవస్తానన్నాడయ్యా?'' అన్నాను నవ్వుతూ.

"అబ్బో! ఊర్కే అలా గంటాడ్సార్! అంత ఇదిగా మీదగ్గిర కొచ్చేదానికి గుండె, చెరువా?'' నన్ను ఉబ్బేస్తున్నాడు, గాడిద!

"కాఫీ తాగావా?'' అన్నాను.

"లేదు, సార్!'' వాడి పంతొమ్మిదేళ్ల ప్రాయం నా ఎదుట మెలికలు తిరిగిపోయింది పావలా డబ్బుల కోసం. పాపం, ఇలాటి అభాగ్యులు కొల్లలు. వాడి యజమానికి కించిత్తు అనుమానంగా ఉన్నా ఈ పిసరంత ఉద్యోగం పీకి పారేస్తాడు.

"వడ్డీ లేదయ్యా! పత్రిక నుండి చెక్కు రాలేదు సరికదా, కథ తిరిగి వచ్చేసింది.'' నిజమే చెప్పాను.

"నే ననుకున్నాను, సార్!''

"షటప్, నా కథ తిరిగివస్తుందనా? ... సర్లేగాని మరి మీవాడితో ఏం చెబుతావ్?''

"మీరు సెలవులో ఉన్నా రనిచెప్పేదా?''

"కరెక్ట్! జబ్బుగా ఉండని ఆఫీసులో అన్నారని కూడా చెప్పు! ఇదుగో, ఈ పావలా పట్టుకుపోయి కాఫీ తాగేసెయ్!'' అని ఉదారంగా కాఫీ డబ్బు లిచ్చాను. వాడు వెళ్ళాడు. వడ్డీకి చక్రవడ్డీ అన్న మాట ఈ కాఫీ డబ్బులు!

సెధవది కాబూలీ రొంపిలో దిగరాదుగాని దిగితే మరి పైకి రావడం కల్ల! మాటకీ నెలకి పన్నెండు రూపాయలు వడ్డీ! మూడు రెట్ల మొత్తానికి బాండు రాసి ఇయ్యాలి వాడికి. ఫస్టయ్యేసరికి ఆఫీసు అరుగు మీద ప్రత్యక్షం. ఒక్కమారు వందరూపాయలు అసలు ఇచ్చేయడం కంటే, పది రూపాయలు వడ్డీఇచ్చి వాణ్ణి అప్పటికి వదిలించుకోవడం సులువుకదా! ఆ సుఖం అలాగా సంవత్సరాంతరబడి సాగిపోతూఉంటుంది మరి!

కానీ ఇందులో ఒక మాట తప్పనిసరిగా చెప్పుకోవాలి. కాబూలీవాడు చెడ్డవాడు కాడు. ససేమిరా కాడు! మనలాగా ఝూటాకోర్ కాడు! ముందుగానే మనకి చెప్తాడు టెర్మ్స్, కండిషన్స్‌ను! దానికి అంగీకారమైతేనే డబ్బు పుచ్చుకోమంటాడు! మనం అవసరానికి తలకాయ ఊపేశాక కాయితం రాయించుకుంటాడు. మొదట్లో మాటాడుకున్న కండిషన్లకి ఏమాత్రం తకరారు లేకుండా వడ్డీ ఇమ్మంటాడు. ఎక్కువిమ్మంటాడా? లేదు! మధ్యలో వడ్డీ పెంచేస్తాడా? పెంచడు! పోనీ, నీకు వడ్డీ ఇవ్వడం కష్టంగా ఉంటే, దానికేం, అసలిచ్చి జబ్బ వదిలించుకోమంటాడు. మర్యాదగా ఉంటే నెల మధ్యలో పది వరకా ఆప్తిస్తాడు, వడ్డీ లేకుండానే! ఒక నెల, రెండు నెల్లూ ఏదైనా సమర్థనీయమైన కారణాలతో వడ్డీ ఇవ్వలేకపోతే క్షమిస్తాడు గానీ మూడో నెల, మూణ్ణెల్ల వడ్డీ కక్కేయమంటాడు. ఇందు కేమాత్రం భిన్నంగా ఉన్నా నీ పరువు తీసి పూర్ణా మార్కెట్ ఎదురుగా బస్ స్టాప్ దగ్గిర వేలం వేస్తాడు. తప్పేముంది?

నాలుగు రోజులు గడవకముందే బజార్లో తారసపడ్డాడు ఖాన్! చూసీచూడనట్టు తప్పించుకో బోయినా కళ్లూరుకోవు. మళ్ళీ చూస్తాయి! తప్పు చేసినప్పటి తత్త్వమే అలాటిది.


వాడు కళ్లతో ఉరిమాడు. సాగా సర్దుకున్నాడు. 'నీ పని పడతా' నని కవలికలతో కబురంపాడు. ఏం చెయ్యను? పరువుతీస్తాడేమో ఖాన్! నెమ్మదిగా ఖాన్‌ని సమీపించాను. నడిరోడ్డు! మూడు నెలల్లే బాకీ ఉన్నానే? సరికి పోగులుపెట్టినా పెడతాడు.

ద్రాక్షపళ్లమ్ముతూన్న చచ్చుటదాన్ని ఉద్దేశించి బేరమాడబోయే నెపంతో ఖాన్ దగ్గిరకెళ్లి మంచున్నాను. ఎవరైనా చూస్తే ఎంత నామోషీ! నేను ఖాన్‌తో మాటాడ్డమా? ఇస్సీ!

"సిసెంత?'' అన్నాను. ద్రాక్షపళ్లది ఉలిక్కిపడింది. ఖాన్ వైపు చూసి చాటుగా చిరునవ్వు నవ్వబోయాను. తపీమని మొహం తప్పించుకున్నాడు ఖాన్! వాడికి అసహ్యంవేసిందా నాతో మాటాడ్డం?

"క్యా, ఖాన్‌భాయీ! కులాసా?'' పక్క చూపులతో

లకోటా ప్రశ్నలు — లాంగ్టన్



పలకరించాను.

"క్యా కులాసా, బద్మాష్! ఝూటా ఖష్ భషా గుణ్మలా బద్రీ హాఫ్ నా యిల్లాకా క్యా ఫాయ్దా లట్‌పట్." ఇది కాదు వాడు మాట్లాడిన భాష! ఇలాగా నాకు ధ్వనించిన ఏవో ఉర్దూ తిట్లు చాలా స్పీడుగా, చిన్న గొంతుతో తిట్టేయసాగాడు ఖాన్! నా పరువు అంత తొందరగా తీసేయడం వాడికిష్టం లేదేమో! రంయ్‌మని అక్కడి నుండి వెళ్లిపోతూ నాకు చిన్న వార్నింగిచ్చి మరీ పోయాడు, "రేపు వడ్డీ పట్కు ఇంట్కి రా!" అని. అంటే రాకపోతే ఎంత పని చేస్తాడో ధ్వనించింది కంఠంలో!

అప్పటికి గండం గడిచింది!

• • •

ఒకటో తారీఖుదాకా మెల్లిగా అలాగే లాగించాను వడ్డీ ఇవ్వకుండా! ఈమధ్య కుర్రాడు రావడం లేదు. ఖాన్ అంత ఇదిగా రాడు! రోడ్డుమీద తగిలేస్తే, విశాఖ పట్నం రేవుకి పెట్టింది పేరు, విశాఖపట్నం అంటేనే అర్థం మరి!

వడ్డీ ఏభై రూపాయలంతా ఒకటో తారీఖు వచ్చే సరికి మాట మున్నూయి అయింది. ఆఫీసుకి డైరెక్టుగానే కాబూలీ ఖాన్ వచ్చాడు.

అంతా విడ్డూరంగా నావైపే చూడసాగారు. అంటే వాళ్లెవరూ కాబూలీ పరిచయమే లేని ప్రబుద్ధులని కాదు. కానీ డైరెక్టుగా ఖాన్ బెగ్గర్ వాళ్లనెపుడూ వడ్డీ అడుగుతూ సమీపించలేదు. దుబాసీలతోనే వ్యవహారాలు సర్దుబాటు చేసుకుంటారు. ముదురు పాకంలో పడితేనేగదా, కాబూలీవాడు స్వయంగా రంగం లోనికి వస్తాడు!

వాణ్ణి కొంచం పక్కకి రమ్మని పిలిచాను.

"వడ్డీ ఇయ్, సాబ్!" అన్నాడు మర్యాదగా.

మున్నూయి రూపాయలు చిరునవ్వుతో ఇచ్చాను.

ఇప్పుడు వాడే నన్ను పక్కకి పిలిచాడు.

ఎవరూ చూడకుండా నన్ను నిలదీసి దడబడా వాడి ఉరుదూ తిట్లు ప్రారంభించాడు. వాడికి తెలుగుతిట్లు రావు. డబ్బియ్యమని అడుగుతున్నట్టే తిట్లు తిట్టేస్తాడు, గాడిద!

"మూర్రూపాయ్ బాకీ ఇయ్" అన్నాడు కొంచెం గట్టిగా.

"ఇప్పుడ్లేదు. మళ్లీ నెల్లో ఇస్తా" అన్నాను.

నా దూరుకోలేదు. జేబుమీద చెయ్యి వేసి తోశాడు. నాలో ఉక్రోషం పొంగుకువచ్చింది. అప్పు ఇచ్చినవాడు, అప్పులవాడు, ఖాన్ బెగ్గర్ నా మీద చెయ్యి చేసుకుని నన్ను తిడుతున్నాడు! ఛీ! ఎందుకువచ్చిన పాడుజన్మ! కానీ ఏం చెయ్యను? వాణ్ణి ఎదిరించలేను! గట్టిగా ఒక మాటన్నా ఈపాటి మర్యాద కూడా ఇయ్యకుండా పదుగుర్లో నన్ను గుంజేసేలాగున్నాడు. అయినా నేను మూరుకోలేదు.

మర్యాదగానే మొహం పేలేసి, దీనంగా బతిమాలే ధోరణి మొహంమీద పులుముకుని, "ఏం చెయ్యను, ఖాన్ బాస్టర్డ్! డబ్బులేదు! కొద్ది రోజుల్లో పర్దేస్తానన్నే. యూ స్కౌండ్రల్! యు విల్ డై విత్ ప్లేగ్! యూ రెపెడ్ క్రీచర్! కొంచెం ఓపిక పట్టు. అయామ్ ఇన్ డిఫికల్టీస్!" అని మనవిచేసుకున్నాను.

"కొద్దిరోజ్లా! హెప్డు, హెప్పుడ్పరిగా చెప్!"



కోతీ నాతీ

ఫోటో— ఎమ్. ఆర్. వెంకట్రమణన్ (మద్రాసు - 4)

భుజం కుదిపేస్తూ అడిగాడు. ఎవరైనా కిటికీలో నించి తొంగిచూస్తున్నారేమో—భయం. దోస్తుగా భుజంమీద చెయ్యేసిన భ్రమ కల్పించడంకోసం నేను కూడా వాడి కాలరు సర్ది, చొక్కా సాపి, భుజం తట్టి వెర్రి నవ్వులు నవ్వసాగాను.

"చెప్ ముందూ!" అన్నాడు విసురుగా.

"పధ్నాలుగో తారీఖు..." నోటికి వచ్చిన అంకె చెప్పాను.

"పధాల్గ తారీఖు నువ్వు రాక్పోతే పదేనే తారీఖ్ మేమే హొస్తాం! పదీ మంద్లో నీ మరేదా తీస్తాం. కాస్కో" అని ఒక తోపు తోసి హీరోలాగా వెళ్లి పోయాడు.

అబ్బ, మన పప్పులేం ఉడకలేదే!

తిరిగి నా గదిలో అడుగు పెట్టడానికి ప్రాణం చచ్చిపోయింది. ఎవ డేం మాటాడినా నా గూర్చి గుస గుసలనే భయం! ఇద్దరు ముగ్గురు స్నేహితులు చిరు నవ్వు నవ్వారు. శత్రువులైనవారు పకిలించారు. మరో కాబూలీవాడిదగ్గర అప్పు తీసుకునైనా వాడి వడ్డీ వాడి కిచ్చేయకపోతే చావు తప్పదు.

• • •

"అరే, అదేమిటె, నిన్నుదయమే మా కుర్రాడి చేతికి మూర్రూపాయ లిచ్చేశానే?" తప్పని ఆశ్చర్య పోతూ వడ్డీకోసం ఆఫీసులోకి వచ్చిన ఖాన్‌తో అన్నాను.

"ఏం కుర్రోడు?" ఖాన్ కప్పుమన్నాడు.

"ఏం కుర్రోడేమిటి? మీవాడేనయ్యా! వాడికి వడ్డీ ఇచ్చేస్తుండమని చెప్పావుగదా? వాడికే?" అన్నాను ధీమాగా దమ్ము లాగుతూ.

"ఇచ్చేశావు?" నమ్మకం లేనట్టు మళ్లీ రెట్టించాడు.

"భలేవాడివే! నిన్న ఉదయ మిచ్చాను." తేలిగ్గా అని వెనక్కి తిరిగిపోయాను.

"నిన్న ఇచ్చావు?" అన్నాడు కళ్లలోకి చూస్తూ.

"ఔను, నిన్ననే! మూర్రూపాయలు! ఒకచోట తీసుకుని మరీ ఇచ్చాను! వెళ్ళు, వెళ్ళు" అన్నాను.

"హోడ్కి ఎంద్కిచ్చావ్?" అనుకుంటూ విసురుగా బైటికెళ్లాడు.

ఒక గడియ గుండెల్లో కమ్ముకున్న మేఘాలు కరిగిపోయిన వాతావరణం ఏర్పడింది. పీడ విరగడైంది.

సాయంత్రం ఆరుదాకా చలాకీగా పనిచేసుకున్నాను. ఆనాళ ఇన్‌స్పెక్షను. అందుకే సెలవు కూడా దొరకలేదు.

"షంక్రావ్ గారూ!" కాబూలీవాడి కంఠం! గుండెల్లో రాయి దిగడిపోయింది.

మళ్లీ వచ్చాడేం కర్మ!

ఆఫీసు గుమ్మంలోకి వెళ్లాను. మావాళ్లంతా నా వెంటనే చేరుకున్నారు. ఖాన్ దుబాసీ కుర్రాడి రెండు చేతులూ విరిచి పట్టుకువచ్చి నిలబెట్టాడు. నాకు పరిస్థితి అర్థమైంది. హేలగా చిరునవ్వు నవ్వి సిగరెట్ నుసి దులుపుతూ, "ఏం బడేగులా మల్లిఖాన్!" అని

పలకరించాను కుర్రాడి నుద్దేశించి.

"ఈడ్కి ఇయ్యలేదంటున్నాడ్!" ఖాన్ ఖంగు మన్నాడు.

కుర్రాడివైపు చూశాను. కుర్రాడు దీనంగా తల వాల్చి నిలబడున్నాడు.

"ఏమ్టా, సెపండీ?" రెట్టించాడు ఖాన్.

"చెప్పడమేంటి మొఖం? ఏరా, నీ కియ్యలా? నిన్న ఉదయం మూ్రూపాయలూ ఆ కొచిన్ కేఫ్ దగ్గిర సైకిలాపి ఇచ్చేశానుగదా, లేదంటావా, ఫూల్!" నాకు నిజంగా చిరాకు ముంచుకువచ్చింది.

"నాకు మీ రియ్యలేదు." తల విసురుగా తిప్పాడు వాడు. వీడి దబాయింపు నే నూహించనిది.

"అరె!" నాకు కంపరమెత్తింది. వాణ్ణి సమీపించాను.

ఖాన్ నా వైపు, వాడివైపు మార్చి మార్చి చూడసాగాడు. కళ్లలో నిజం పసిగట్టే రివాజు యత్నం చేస్తున్నాడు. చాలా కోపంగా ఉన్నాడు. పెదాలు వణికి పోతున్నాయి. నా కర్మకొద్దీ నా మాట నమ్మకపోతే నన్ను ఇంత జనంమధ్యా చావగొడతాడు. నమ్మితే ఆ కుర్రాడి చావు మూడుతుంది! తప్పదు! నాకు భయంవేసింది.

నా భయాన్ని కుర్రాడు చూశాడు.

"నిజంగా నే నీ్నీ కియ్యలేదా?" నా మీద నాకే నమ్మకం లేనట్టుగా అడిగాను కుర్రవాణ్ణి. కుర్రాడు మౌనం వహించాడు. నా చుట్టూ ఉన్న మిత్రులంతా అడిగారు వాణ్ణి, ఇచ్చాడో లేదో! అందరివైపూ పరకాయించి చూసి, తరవాత నా వైపు జాలిగా తిరిగాడు.

"ఈడు ఇలగ సెప్పు" అని ఫెట్ మని బుగ్గ మీద కొట్టాడు ఖాన్! రాక్షస చేతులు వాడివి! "అమ్మా" అన్నాడు కుర్రాడు.

"చెప్! చెప్, బద్మాష్! ఆ సాబ్ ఇచ్చార్ కదూ? చెప్రా పాగల్‌కా బచ్చా! ఎక్డ? ఏం చేశావ్ పైసా?" అని ఫెడఫెడ వాయించాడు.

"ఆఁ! ఇచ్చారు. ఖర్చైపోయింది!" అన్నాడు నా వైపూ, నా చుట్టూ ఉన్న జనంవైపూచూ స్తూ కుర్రాడు.

"అదుగో, నిజం కక్కేశాడు!" అన్నాను నేను.

ఖాన్ ఇక వాయించడం మొదలెటాడు.

"ఈ బద్మాష్‌కి ఎందుక్కు ఇచ్చార్, సాబ్? ఈడ్కి ఉద్యోగంలోంచి తీశ్నాం! ఇలాగే అందర్కాడా వడ్డీ తీస్కుని ఖర్చ్ పెట్టేసి ఎవరూ ఇయ్యలేదని బుకాయించ్‌తాడు" అని కుర్రాణ్ణి ఈడ్చి కొడుతూ, "క్యారే, కా బాత్! పైసా కహాఁరే" అంటూ చావ బాదసాగాడు కుర్రాణ్ణి. ఎవరూ వాణ్ణి సమీపించలేదు. అందరికీ భయమే!

ఇష్టంవచ్చిన బూతులు తురకంలో తిట్టి, కొట్టిన చోటే కొడుతూ ఆ కుర్రాడికి శోష వచ్చి పడిపోయినంతవరకూ ఉతికేశాడు ఖాన్.

ఒకొక్క దెబ్బ నా మీద పడిపోతున్నంత బాధ కలిగింది నాకు.

"పోన్లే, ఖాన్! ఏదో కుర్రాడు! అయిపోయింది, మన్వేళ్లు. ఈసారి కూరుకో!" అన్నాను, అంతా అయిపోయాక.

ఆ కుర్రాడు నావైపు చూశాడు. కృతజ్ఞతతో కాదు! ఇంకా తిడుతూనే మహా విసుగ్గా, విసురుగా ఖాన్ వెళ్లాడు. అందరూ నవ్వుకుంటూ ఎవరి దారిన వారు ఇంటికి వెళ్లారు. నేనూ, కుర్రాడూ మిగిలాం అక్కడ!

నాకు భయం వేసి వెళ్లిపోబోయాను గానీ, ఆ కుర్రాడికి గ్లాసుడు మంచినీళ్లివ్వడం మనిషిగా నా ధర్మమనిపించింది.

వాణ్ణి సమీపించి లేవనెత్తాను.

వాడి ఉద్యోగం పోయిందని నాకు అంతకుముందే తెలుసు!

అందుకు కారణం కూడా నాకు తెలుసు!

ఆ కారణమే నాకు ఉపయోగపడింది కూడా!

ఆ నెపంతోనే వాడిమీదికి నెట్టాను వ్యవహారమంతా!

"మంచినీళ్లు తాగుతావా?" అన్నాను.

నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

ఒళ్లు హూనమైపోయినట్టుంది, పాపం! ఆ దెబ్బలన్నీ తప్పకుండా నాకు తగిలేవే, వీడు డబ్బు పుచ్చుకున్నట్టు ఒప్పుకుమండకపోతే!

"ఎందుకు ఒప్పుకున్నావ్ నువ్వు?" నిజంగా బాధపడుతూ అడిగాను నేను.

"మీరు గొప్పవాళ్లు! పదిమందిలో దెబ్బలు తినడం మీకు నామోషీ! నాకు ఫరవాలేదు! నాకు పరువూ మర్యాదా లేవు. అక్కర్లేదు. అక్కర్లేదనుకునే గదా నామీదికి తోశారు నింద? మీ చదువు, మీ హోదా, మీ డాబూ నాకు లేవు."

వెక్కివెక్కి ఏడవసాగాడు.

సులువుగా, ఆశువుగా అబద్ధమాడి గండం గడుపుకున్న నా బరువైన గొప్పదనం నా తలను పాతాళానికి వంచింది! ★

చీకటినుంచి వెలుగులోనికి

ఫోటో — ఎమ్. బి. ఎన్. చారి (గుంటూరు - 2)

